


మగధీర సినిమాకి మాతృకగా వివాదాల్లోకి ఎక్కిన నవల.

రచయిత ప్రత్యేక అనుమతితో  పునర్ముద్రణ.

(ప్రారంభం)

## 1

**'ది బిగినింగ్ ఆఫ్ ది బిగినింగ్'**

ఫట! ఫట! మంటూ నిశీధిలో మెరుపుల కొమ్మలు విరిగిపోతున్నాయి.

ఫెళ! ఫెళ! మంటూ మేఘాల రాపిడికి ఆకాశం భయంకరంగా గర్జిస్తోంది.

రయ్! రయ్!మంటూ పెనుగాలి ఉధ్ధుతంగా నేలను అలుముకుంటోంది.

ఫెడేల్! ఫెడేల్! మంటూన్న చెట్ల కొమ్మలు విరుగుతున్నాయి.

ఒక్కసారిగా నింగినున్న చుక్కలన్నీ నేలపైకి రాలిపోయినట్టు మిణుగురు పురుగులు గాలిలో తేలిపోతున్నాయి.

నభోతలం కుండపోతకు సిద్ధపడుతోంది.

ఆ వాతావరణంలో..

వింధ్యారణ్యంలో ఏనాడో నేలమట్టమయిన ఓ రాజ్యం తాలూకు దిగుడు బావి దాని ప్రక్కనే పాడుబడిన ఓ గుడి ఉన్న ప్రాంతంలోకి అడవిలోని దుప్పి గుంపులూ, లేళ్ళమందులూ చేరుకున్నాయి.

శతాబ్దాల కాలగమనంలో విస్తరించిన కానన మధ్యమంలో ఉండి పోయింది 'బుందేల్ బౌలీ' అనే ఆ దిగుడు బావి.

లేళ్ళగుంపులక్కడికి చేరుకున్న కొద్దిసేపటికే దూరంగా పులిగాండ్రింపు వినిపించింది.

పారిపోవడానికి అనుకూలంగాలేని వాతావరణ ప్రభావంలో గత్యంతరంలేక బిక్కుబిక్కుమంటూ నుంచునిపోయాయా లేళ్ళు.

కానీ ఆ గుంపు మధ్యలోంచి దిగ్గున లేచింది బలంగా, పుష్టిగా కనిపిస్తున్న ఓ దుప్పి. ఆ గుంపులో దానంత ఎత్తున్న మరో ప్రాణి కనిపించడంలేదు.

ఆ లేచి నిలబడిన దుప్పి ఓసారి తన ఒంటిని బలంగా విరుచుకుంది. ఆ తర్వాత బరువుగా అడుగులు వేస్తూ బుందేల్ దిగుడు బావి గోడకు తన ఒళ్ళునుగట్టిగా రుద్దుకుంది.

నిటారుగా నిలబడి ఉన్న కత్తుల్లాంటి తన కొమ్మల్ని సానబడుతున్నట్లుగా బావి గోడపైన బలంగా రాసింది.

ఆ తర్వాత ఠీవిగా తలెత్తుకుని గుంపును దాటి వచ్చి అడవి కభిముఖంగా సవాలు చేస్తున్నట్లుగా గర్జించింది.

ఈసారి పులి దగ్గరలో గర్జించింది.

లేళ్ళ గుంపులొక్కసారిగా చెదిరిపోతూ కదిలిపోతుండగా, కాలి గిట్టలు దుమ్మురేపుతుండగా గిర్రున వెనక్కి తిరిగింది ముందు నిలబడి ఉన్న ఆ పెద్ద దుప్పి.

ఆ దుప్పి కళ్ళు నిప్పుకణికల్లా ఉన్నాయి.

దాని కళ్ళల్లోని తీక్షణతని గమనించిన లేళ్ళ మందల్లోని కదలికలు ఆగిపోయాయి. దాంతో మళ్ళీ వెనక్కి తిరిగి అడవి వంక చూస్తూ నిలబడిందా పెద్ద దుప్పి.

అప్పుడు దూరం నుంచి రెల్లు గడ్డిపైనుంచి దూకుతూ వస్తూ కనిపించింది పులి. దాన్ని చూడగానే ఆ పెద్ద దుప్పి శరీరంలోని కండరాలొక్కసారిగా బిగుసుకున్నాయి.

బలాన్ని కూడదీసుకుంటున్న దాని ఎముకల ధ్వనులు వెలుపలికే వినిపించసాగాయి.

శరవేగంతో దూసుకువచ్చిన ఆ పులి కదిలికలేని ఆ లేళ్ళ  గుంపుకు దూరంగా ఆశ్చర్యపోతున్నట్లుగా ఠక్కున ఆగిపోయింది.

తనని చూసి పరుగులు తీయబోయే ఆ లేళ్ళగుంపులోని ఓ లేడిని వేటాడాలనుకున్న దాని ఆశలు నీరుకారిపోయినట్టున్నాయి.

కానీ ఆ మరుక్షణంలోనే యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్టుగా నిలబడి ఉన్న ఆ పెద్ద దుప్పి కళ్ళల్లోని తీక్షణతను గమనించి తీవ్రంగా గర్జించిందా పులి. అలా అరుస్తూనే ఛెంగున గాల్లోకి ఎగిరిన పులిని చూసి తన తల నొక్కసారి విదిలించిందా దుప్పి.

అంతదూరం నుంచి విసురుగా దూకబోయిన ఆ పులి శరీరానికి ఎదురుగా కాళ్ళు వెనక్కి తన్ని తన తలని కొద్దిగా వంచి నిలబడిపోయింది.

దాంతో ఊహించని విధంగా దుప్పికొమ్ములొక్కసారిగా పులికడుపులోకి దూసుకుపోయాయి.

చిక్కు చిక్కులుగా, కొక్కాలుగా తేలివున్న తనకొమ్ముల్లోకి దూసుకువచ్చిన పులి శరీరాన్ని ఒక్కసారిగా గాలిలోకి లేవనెత్తిందా దుప్పి, పైనున్న పులి శరీరం బాధతో గిలగిల్లాడుతుండగా, తను పడిపోకుండా ఉండేందుకు దిగుడుబావి గోడనానుకుంటూ తన ప్రమేయం లేకుండానే ఆ బావి చుట్టూ ప్రదక్షిణం చేస్తూపోయిందా దుప్పి.

పైగా బరువును సర్దుకునే ప్రయత్నంగా ఆ దుప్పి కొమ్ముల్ని విదిలించినప్పుడల్లా వాడిగా ఉన్న కత్తుల్లా పనిచేస్తూ ఆ పులి శరీరం తెగుతూ పోయింది. అలా బావి చుట్టూ తిరుగుతున్న దుప్పి తలపై నుంచి పులి శరీరంలోంచి రక్తం వెలువడుతూ దిగుడు బావిలోకి చిమ్మసాగింది.

అంతర్గతంగా నిబిడీకృతమైవున్న తన శక్తినంతా కూడగట్టుకుంటూ తన కొమ్ముల పైనున్న పులి శరీరం బరువుతో కదలివస్తూ బుందేల్ దిగుడుబావి గోడ ఆసరాని తీసుకుంటున్న ఆ పెద్ద దుప్పికి అడ్డురాకుండా ఉండే ప్రయత్నంలో భాగం అన్నట్లుగా ప్రక్కకి తొలిగిన లేళ్ళ గుంపుల కొమ్ములొక్కసారిగా ఊకుమ్మడిగా ఘర్షణకి లోనయ్యాయి.

ఆ కొమ్ముల రాపిడి ద్వారా కలిగిన ధ్వనులు చిడతల రామాయణంలోని నటుల చేతుల్లోని చిడతల చప్పుళ్ళల్లా శ్రీకృష్ణ జయింతి కోలాటం స్త్రీల చేతుల్లోని కర్రల దరువుల్లా వినిపించాయి.

అప్పటికే దుప్పి కొమ్ములు పొడుచుకుని ఉన్న పెద్దపులి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

తన కొమ్ముల పైన పులి శరీరం అచేతనావస్థలోకి జారిపోవడం ఆ దుప్పికి తెలిసిపోయింది.

దాంతో తన శరీర ధారుఢ్యాన్ని సమీకరించుకుంటూ నేలపైన గిరగిరా తిరిగిపోతూ ఆ పులి నిర్జీవకాయాన్ని గాలిలోకి విసిరేసిందా దుప్పి.

ప్రపంచంలోని వింతల్లోకెల్లా ఓ వింతగా ఓ లేడి శక్తిముందు ఓడిపోయి ప్రాణాల్నే కోల్పోయిన ఆ పెద్దపులి మరణయాతనని 'మాళ కాజిల్ టవర్' పైనుంచి బైనాక్యులర్స్ ద్వారా నిశితంగా గమనించింది అన్నపూర్ణ.

అంతవరకూ ఎత్తయిన ప్రదేశంలో ఉన్న ఆ టవర్ పైనుంచి కొద్ది దూరంలో క్రింది ఉపరితలంలో ఉన్న బుందేల్ దిగుడు బావి దగ్గర జరుగుతున్న పులి, లేడి యుద్ధాన్ని తను కూడా ఆసక్తిగా గమనించాడు డ్రైవర్ రామ్ సింగ్.

కానీ హఠాత్తుగా అన్నపూర్ణ వంక చూడాల్సి వచ్చిందతను.

అంతవరకూ ఆ జంతువుల పోరాటాన్ని అతి ఉత్సాహంతో గమనిస్తున్న ఆమె వదనంలో కలుగుతున్న మార్పుల్ని గమనిస్తూనే ఆశ్చర్యంతో కళ్ళు తేలవేశాడతను.

"వ్యాఘ్ర రుధిరం సమర్పయామి! వ్యాఘ్ర రుధిరం సమర్పయామి" అంటూ నేలపైకి జారిపోయింది అన్నపూర్ణ.

విషయమేమిటో రామ్‌సింగ్‌కి బోధపడకుండా పోయింది.

"మేడం! కాఫీని సిద్ధం చేయమంటారా?" అంటూ అడుగుతున్న అతన్ని గమనించే స్థితిలో లేదామె.

కానీ ఏదో శక్తి పురిగొల్పుతున్నట్లుగా లేచి నిలబడే ప్రయత్నం చేసింది అన్నపూర్ణ.

ఆమె దృష్టి వెంటనే కొద్ది దూరంలో ఉన్న ఆ దిగుడుబావి పైన నిలిచిపోయింది. అప్పుడామెకు కనిపించిన దృశ్యాన్ని గమనిస్తూనే ఆమె శరీరం కాస్తా వణికిపోసాగింది.

ఆ బుందేల్ దిగుడు బావి నిండా ఏదో వెలుగు నిండుకున్నట్లుగా ఆ వెలుగు బావిగోడల పైనుంచి పొరలుతున్నట్లుగా ఓ విచిత్రమైన అనుభూతికి లోనయ్యిందామె.

ఆ వింత అనుభవానికి లోనవుతుండగానే ఆమె కళ్ళు గిర్రున తిరిగిపోసాగాయి. తననేదో మైకం కమ్ముకుంటున్నట్లుకాగా ఆమె శరీరం అచేతనావస్థని సంతరించుకోసాగింది.

దాంతో కుప్పలా నేలకు జారిపోయింది అన్నపూర్ణ.

●●●

ఓ రకమైన సుషుప్తావస్థలోకి వెళ్ళిపోయిన అన్నపూర్ణ కళ్ళముందు 'యోగి' సాక్షాత్కరించాడు.

ఓ రాజగురువు రూపంలో కనిపిస్తున్న ఆ ఆకృతి అన్నపూర్ణ శిరస్సుపై ఆశీర్వదిస్తున్నట్లుగా తన చేతుల్ని కదిలించింది.

దాంతో ఏదో శక్తి ఆమెను ఆవహించినట్టయింది.

ఆ ప్రభావంతో కళ్ళు తెరుస్తూనే దిగ్గున లేచి కూర్చుందామె.

"ఎలావుంది అన్నపూర్ణా?" భర్త భావానీ ప్రసాద్ ప్రశ్నని ఆమె వినిపించుకున్నట్లుగా లేదు.

"పూర్ణా! అన్నపూర్ణా!" అంటూ ఆమె శరీరాన్ని గట్టిగా విదిలించాడు భవానీప్రసాద్.

ఆ కదలిక ప్రభావం కాస్త ఆమెని ఓ క్షణకాలం వాస్తవ స్థితిగతుల్లోకి లాక్కుని వచ్చాయి.

"ఏంటండీ! నాకేం అయింది?" అంటున్న భార్యవంక అయోమయంగా చూశాడు భవానీ ప్రసాద్.

"అంటే జరిగిందేమిటో నీకు గుర్తురావడంలేదా పూర్ణా? గతరాత్రి పులికీ, ఓ లేడికీ జరిగిన పోరాటాన్ని చూస్తూ స్పృహ కోల్పోయావని రామ్‌సింగ్ చెప్పాడు" అన్నాడతను.

అది వింటూనే తుళ్ళిపడింది అన్నపూర్ణ.

ఒక్కసారిగా అంతకుముందు జరిగినదంతా ఆమెకి బాగా గుర్తుకు వచ్చేసింది.

"రామ్ సింగ్‌ని ఓసారిలా పిలవండి" అంది అన్నపూర్ణ.

"రామ్ సింగ్ లేడు. మనకోసం టిఫిన్ తీసుకురావడానికి ఓర్చాకి వెళ్ళాడు" అన్నాడు భవానీ ప్రసాద్.

ఆమె అతని మాటల్ని వినిపించుకున్నట్లుగా లేదు. ఆమె మొహంలో అకస్మాత్తుగా కలుగుతున్న మార్పుల్ని చూసి కంగారు పడసాగాడతను.

"పూర్ణా! ఆగు" అంటూ అరిచిన అతని ప్రయత్నమేమీ ఫలించలేదు. దాంతో ప్రక్కనున్న రైఫిల్‌ని అందుకుని పరుగెత్తాడతను.

ఆమె అప్పటికే అడవిలోని ఆ ఫారెస్ట్ వాచ్ టవర్ మాళవ కాజిల్ మెట్లని గబగబా దిగిపోయింది.

క్రింది లోయలోవున్న బుందేల్ దిగుడు బావి వంక వేగంగా నడుతున్న భార్యని వెర్రిగా అనుసరించాడతను.

ఆ బావి దగ్గరకు రాగానే అందులోనుంచి ఇంకా కాంతి వలయాలు పొంగి పొరలుతున్నట్లుగానే తోచిందామెకి.

బావి గోడప్రక్కనే పడివున్న పులి నిర్జీవకాయాన్ని చూసి ఓసారి శుష్క మందహాసం చేసింది అన్నపూర్ణ.

"వ్యాఘ్ర రుధిరం సమర్పితం" అంటూ ఆమె చెవుల్లో ప్రతిధ్వనించింది.

ఆ పదాలు ఆమె చెవుల్లో మార్మోగుతుండగా గబగబా బావిలోని దిగుడు మెట్ల ద్వారం వంక అడుగులేసిందామె.

ఆ బుందేల్ దిగుడు బావి ఓ అతి విశాలమైన కోనేరులా ఆ అడవి నట్టనడుమ నిలిచివుంది.

చుట్టూ దట్టమైన చెట్లు, చేమలు, తీగలు అలుముకుని ఉన్నాయి. దాదాపు ముప్పై అడుగుల వెడల్పుగల ఆ బావి లోపల భాగం అంతా మట్టితో కప్పబడివుంది. ఆ గోడని వెన్నంటుతూ అడుగు భాగందాకా మెట్లు నిర్మించబడి ఉన్నాయి.

ఆ బావిలోతు దాదాపు నలభై అడుగులు ఉండవచ్చుననుకున్నాడు భవానీ ప్రసాద్.

తను బావిలోని మెట్లమీదుగా వేగంగా దిగిపోతున్న అడుగుల వేగంతో సమానంగా అంతవరకూ బావి గోడలమీదుగా పొంగిపొరలిన కాంతి మట్టం తగ్గిపోతూ ఉండటాన్ని అప్రయత్నంగానే గమనించింది అన్నపూర్ణ.

భార్యకు కనిపిస్తున్న ఆ కాంతి విశేషం భవానీ ప్రసాద్‌కు కనిపించలేదు. అతనికా బావి ఓ పాడుబడిన ఎండు గోతిలా తోచింది.

ఏ మాత్రం భయం అన్నదే లేకుండా ఆ గోడ వెంబడే బావి అడుగు దాకా సాగుతున్న మెట్ల దొంతరని అవలీలగా దాటేస్తున్న భార్యవంక నిర్విణ్ణుడయి చూస్తూ ఉండిపోయాడు భవానీ ప్రసాద్.

బావి అడుగులో నీరు ఓ మోకాలు లోతు మాత్రమే ఉంది.

ఆ నీటిలోకి దిగిపోయి బావి నడుమ ప్రాంతంలోకి చేరుకుని పైకి చూసింది అన్నపూర్ణ.

బావి ఉపరితలంలోంచి లోనికి వెలుగంత బాగా రాకపోవడంతో లోపల బాగా చీకటిగా ఉంది.

ఆ మసకచీకటిలో బావి నడుమ నీటిలో లీలగా కనిపిస్తోంది ఒక శివలింగం.

భవానీప్రసాద్ కూడా ఆశ్చర్యంగా ఆ లింగం వంక చూశాడు.

కానీ శివలింగం క్రిందుగా ఉన్న దోనెలోనుంచి పొంగిపొరలుతున్న కాంతి పుంజాలు మాత్రం అన్నపూర్ణ ఒక్కదానికే కనిపించాయి.

హఠాత్తుగా ఆమె కెదురుగా లీలగా బావి గోడపై కనిపించిన ఓ మనిషి ఆకృతి వంక ఆశ్చర్యంగా చూసిందామె.

అంతక్రితం మాళవ కాజిల్‌లో తనకు కనిపించిన యోగి స్వరూపాన్ని చూస్తూ నమస్కారం చేసింది.

భవానీ ప్రసాద్‌కి భార్య ధోరణి వెర్రెక్కించసాగింది. చీకట్లో అతనికేమీ కనిపించడంలేదు.

బావి గోడలో కనిపించిన ఆ యోగమూర్తి ఆకృతి శివలింగం దగ్గరగా వచ్చి అన్నపూర్ణ వంక తిరుగుతూ తన అభయహస్తాన్ని చూపాడు.

ఆ యోగి అరచేతిలోనుంచి జరిగిన కిరణ ప్రసారం అన్నపూర్ణ వంటిమీద దుస్తులగుండా వెళ్ళి ఆమె కడుపులోకి చొచ్చుకుపోయాయి.

అదేమిటో అర్థంకాకుండా నుంచున్న ఆమెని శివలింగాన్ని తాకవలసిందిగా ఆదేశించిందా యోగి రూపం.

అన్నపూర్ణ వెంటనే ఆ శివలింగాన్ని దోనెలోనుంచి అవలీలగా లేవనెత్తడం చూసి తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు భవానీ ప్రసాద్. అతనికి అక్కడ జరుగుతున్నదేమిటో అర్థంకాక పిచ్చెక్కిపోసాగింది. భార్యకి ఆ శివలింగాన్నెత్తగలిగిన శక్తి ఎక్కడినుంచి వచ్చిందో బోధపడక బుర్రని బ్రద్దలు చేసుకోసాగాడు.

శివలింగం అడుగులోనున్న దోనెలో వెలుగింకా కేంద్రీకృతమై ఉంది.

ఆ వెలుగులో అన్నపూర్ణకి అరచేతి వెడల్పున స్వర్ణపత్రం కనిపించింది.

ఆ పత్రాన్నందుకుందామె ఆ చీకటిలో ఆమె కళ్ళకి పత్రంలోని అక్షరాలు స్పష్టంగా కనిపించాయి.

ఆ పత్రంలోని విషయాల్ని చదవగానే అన్నపూర్ణ ఒళ్ళు ఒక్కసారిగా జలదరించింది.

ఆశ్చర్యంగా ఆ శివలింగం దోనెలోకి చూసింది.

అక్కడి వెలుగంతా ఓ కాంతి పుంజంలా రూపుదిద్దుకుంటూ తనవంక రావడాన్ని గమనించి చేతుల్ని చాచి నుంచుందామె. అలా వచ్చిన ఆ వెలుగు పుంజం తన కడుపులోకి దూసుకెళ్ళడం ఆమెకి తెలిసిపోయింది.

ఆ మరుక్షణమే తన గర్భకోశంలో ఏదో కదలిక ఏర్పడిన అనుభూతికి లోనయ్యిందామె.

ఇది జరిగి నేటికి 20 సంవత్సరాలు కావస్తున్నాయి. గర్భం దాల్చిన గహస్యం గుప్పిట వీడేదెప్పుడో?

బుందేల్ బావిలో ఓ కాంతిపుంజం అన్నపూర్ణ గర్భంలో ప్రవేశించిన 20 సంవత్సరాల తర్వాత మళ్ళీ ప్రదేశంలో ఇన్నేళ్ళపాటు గాలిలో గాలిలా, శూన్యంలా నిశ్శబ్దంగా కాలాన్ని గమనిస్తున్న ఓ అదృశ్య శక్తికి చలనం వచ్చింది. అందుకు కారణం?

●●●

**ది బిగినింగ్**

నిశ్శబ్ద వాతావరణంలో ఓ బ్రహ్మాండనాదం వినిపించింది.

వింధ్యాచలంలోని ఓ కొండ చెరియ హఠాత్తుగా విరిగి పడిపోయింది.

పై నుంచి కూలుతోన్న బండరాళ్ళన్నీ దొర్లుతూ క్రిందికి జారిపోసాగాయి.

ఆ పెద్ద పెద్ద రాళ్ళు పడటం ద్వారా ఏర్పడిన ఘర్షణకి చుట్టూ ప్రక్కల్లో అగ్ని వర్షం కురిసింది.

ఆ నిప్పురవ్వల తాకిడికి ఎండుటాకులు రాజుకున్నాయి.

దాంతో పరిసరాలన్నీ భగ్గుమన్నాయి.

గాలి ఉధ్ధృతంగా వీచింది.

ఆ ప్రభంజనంతో ఆ కొండ ఓ అగ్నిపర్వతంలా మారిపోయింది.

పొడినేలపైన పరుచుకుని ఉన్న ఎండుగడ్డిపైన ఆవురావురుమంటూ ఆ అగ్ని ప్రవాహం అంచెలంచెలుగా ముందుకు సాగింది.

క్షణాల్లో మంటలు కొండ క్రిందికి వ్యాపించాయి.

పచ్చిచెట్లు కూడా మండిపోయాయి.

మంటలంటుకున్న పొదరిళ్ళన్నీ కుప్పలు కుప్పలుగా కూలిపోవటం ప్రారంభించాయి.

తమ స్థావరాలలా తొలగిపోవటంతో అడవిలోని జంతుజాలం పరుగు ప్రారంభించింది.

ఆకాశం నిండా పొగలు నిండుకున్నాయి.

ఆ ధూమ వలయాలు చీకటి కొండల్లా గాల్లో తేలిపోతున్నాయి. వాటినిండా అగ్గిరవ్వలు చుక్కల్ని మురిపిస్తున్నాయి.

ప్రాణ భయంతో పరుగులు తీస్తూన్న లేళ్ళ మందల్లో పులులు కూడా కలిసిపోయాయి.

పుట్టల్నీ పలుగురాళ్ళనీ వదిలి వెలికివచ్చిన పాములూ, తేళ్ళూ వెర్రిగా పరుగెడుతున్నాయి. అంతటి మంటల్లోనూ గరుడ పక్షులు పాముల్ని వేటాడటం మొదలెట్టాయి.

ఆ బ్యాక్ గ్రౌండ్ సృష్టించిన వాతావరణంలో

ఓ నల్లని గుర్రంపైన స్వారీ చేస్తూ ఆ మంటల్లోంచే దూసుకొస్తున్న దానిలా కెమెరా ముందుకు వచ్చింది రూపమతి.

ఆ అమ్మాయికి ఇరవై ఏళ్ళుంటాయి.

మంటల్లోనుంచి దూసుకొస్తుండగా మండిపోతున్న తన దుస్తుల్ని ఒకటొకటిగా విసిరేస్తూ వచ్చిందామె.

కెమెరాకి దగ్గరగా వచ్చేసరికి ఆమె శరీరం పైనున్న బట్టలన్నీ తొలిగిపోయాయి.

గుర్రం పరిగెడుతూ వస్తూంటే ఆమె గుండెలు ఎగిరెగిరి పడుతున్నాయి.

కెమెరా ముందునుంచి పరుగుతీసిన రూపమతి రూపాన్ని ఆమె వెనుక వైపు నుంచి చిత్రీకరణ ప్రారంభమయ్యింది.

మరో కెమేరా ముందు బేత్వానది కనిపించింది.

అడవిలోని మంటల్ని తప్పించుకుని పరిగెత్తుకు వచ్చిన జంతువులన్నీ కూడా ఆ నది నీటిలో తలదాచుకున్నాయి.

దాంతో నదిలోని మొసళ్ళు పండుగ చేసుకోసాగాయి.

ఓ పెద్దపులి సైతం మొసలికి ఆహారంగా మారటాన్ని ఆ కెమేరా చిత్రీకరించింది.

ఆ రెండు కెమేరాల చిత్రీకరణ మధ్య ప్రాంతంలోకి వచ్చి ఆగిపోయింది రూపమతి కూర్చుని ఉన్న నల్లగుర్రం.

వెనకవైపు మంటలు మండుతూనే ఉన్నాయి.

పూర్తిగా కాకున్నా దాదాపు నగ్నంగా మారిపోయిన రూపమతి శరీరము ఆ మంటల వెలుగులో బాహాటంగా కనిపిస్తోంది.

ఆ రెండు కెమేరాలూ ఆమె చుట్టూరా తిరుగుతూ చిత్రీకరిస్తుండగా పైన ఆకాశంలో ఓ విమానం కనిపించింది.

మండుతోన్న అడవిని ఆర్పేందుకు ప్రభుత్వం పంపిన సాధనంలా కృత్రిమ వర్షాన్ని కురిపించిందా విమానం.

ఆ వర్షం నీటిలో తడిసిపోతున్న రూపమతిని కూడా ఆ కెమేరాలు చిత్రీకరించాయి,

మరోవైపు అడవిలోని మంటలు కూడా తగ్గుముఖం పట్టసాగాయి.

పూర్తిగా తడిసిపోయిన రూపమతి ఆ విమానం వంకోసారి తలెత్తి చూసింది.

అదే సమయంలో క్రిందకి వస్తున్నట్లుగా ఎరుగుతూన్న ఆ విమానం తలుపు తెరుచుకుంది.

విమానం తలుపలా తెరుచుకోగానే అందులోనుంచి - చండేరి...! చండేరీ...!

అంటూ ధ్వని తరంగాలు క్రిందికి దూసుకొచ్చాయి.

ఈలోగా నేలమీద ఉన్న సౌండ్ బాక్సులన్నిట్లో కూడా అవే పిలుపులు తారాస్థాయినందుకున్నాయి.

ఇంతలో ఆ విమానంలోనుంచే పూర్తిగా బంగారం వర్ణంతోగల వెలుగులు చిమ్మాయి.

ఆ వెలుగుల్లోనుంచి ఓ 'చండేరీ గోల్డ్ జరీ శారీ' పైనుంచి విసరబడింది.

ఆ చీర మెల్లిగా గాల్లో తేలుతూ వచ్చి గుర్రంపైన కూర్చుని ఉన్న రూపమతి శరీరాన్ని కప్పేసింది!

"కట్!"

అంటూ అరిచాడు అసిస్టెంట్ డైరెక్టర్ పాండే

తనకో పెద్ద 'రిలీఫ్' లభించినట్లుగా అతనివంక చూసింది రూపమతి.

తన బొటనవేలునెత్తి చూపుతూన్న అతని వంక చూడలేకపోయిందామె.

పాండే కళ్ళలో కోరిక తొణికిసలాడుతోంది.

ఇంతలో గుర్రం తాలూకు మనిషి వచ్చి గుర్రాన్ని మేకప్ వైపునకు తీసికెళ్ళటం ప్రారంభించేసరికి సులభంగా గాలి పీల్చుకోసాగిందామె.

●●●

హోటల్లోని తన గదిలోకి వచ్చి పాండే చెప్పిన విషయాన్ని వింటూనే రూపమతికి చెమటలు ముంచుకొచ్చాయి.

"నో! నేను రాలేను, నాకిష్టంలేదు!" అంటూన్న ఆమె వంక తీక్షణంగా చూశాడతను.

"ఫిల్మ్‌లో యాక్ట్ చేసినందుకు డబ్బక్కరలేదా? " అంటూన్న అతని వంక కొరడా దెబ్బ తిన్నదానిలా తలెత్తి చూసింది రూపమతి.

"అంటే నేను మీరు చెప్పినట్లుగా వింటేనే నాకు డబ్బిస్తారా?" అంటూన్న ఆమెవంక చూడలేదను.

"ఇప్పటికే నన్ను దాదాపు అరగంటసేపు ఆ అడవిలో నగ్నంగా నిలబెట్టారు. సగం చచ్చిపోయాను. ఇప్పుడిదొక్కటా? ఇలా అని తెలిస్తే" అంటూ అర్ధాంతరంగానే ఆగిపోయింది.

"నేను మీ కామెంట్స్ వింటానికి రాలేదు. డైరెక్టర్ మిమ్మల్ని గెస్ట్ హౌస్‌కు తీసుకురమ్మన్నారు. ఈ రాత్రికి మీరక్కడే ఉండి మీ డబ్బుని తీసుకుని ఉదయాన్నే వెళ్ళిపొండి. మీ మంచికే చెబుతున్నాను. లేకపోతే మీ ఇష్టం. మీరిలా మొండికేస్తే మీ ఫిల్మ్‌ని తీసి చెత్త డబ్బాలో వేసేసి మరో అమ్మాయితో మళ్ళీ షూటింగ్‌ని మొదలెట్టగలడాయన!" అంటూన్న పాండే వంక హతాశురాలై చూసింది రూపమతి.

లక్ష్మీబాయి కాలేజీలో ట్రైనింగ్ కంటూ వచ్చిన రూపమతి 'చండేరీ శారీ' అడ్వర్టయిజు మెంటు ఫిల్ములో నటిస్తే పాతికవేల రూపాయలిస్తానంటూ వచ్చిన పాండే ప్రపోజల్‌ని వెనకా ముందూ ఆలోచించకుండా వెంటనే అంగీకరించింది.

'చండేరీ గోల్డ్ జరీ శారీ'ల యాడ్ ఫిల్ములో నటించిన ఎందరో అమ్మాయిలకు సినిమాల్లో ఛాన్సు రావటం చూసిన తనకు కూడా ఆశముంచుకువచ్చింది.

కానీ ఆ 'ఆశఖరీదు' ఇంతగా ఉంటుందని ఆమె ఊహించలేక పోయింది.

"ఏంటి మిస్ రూపా! వస్తున్నారా లేదా?" అంటూన్న పాండేని రూపమతి అనుసరించక తప్పలేదు

"మొట్టమొదటిసారిగా మా డైరెక్టర్‌గారు నన్నే 'చండేరీ ఇన్ ఫెర్నోసారీ' యాడ్ ఫిల్ముకి మోడల్‌ను సెలక్ట్ చేయమన్నారు. పైగా మొట్టమొదటిసారిగా ఇంత ఖరీదయిన యాడ్ ఫిల్ముని నన్నే డైరెక్ట్ చేయమన్నారు.

అలాగే మొట్టమొదటిసారిగా ఆయన రుచి చూడని అమ్మాయితో గడిపే అవకాశం కూడా వస్తుందనుకున్నాను. కానీ నిన్నీరాత్రికాయన తీసుకురమ్మని చెప్పేసరికి ఇంతవరకూ కలిగిన నా ఉత్సాహం అంతా కూడా నీరుకారిపోయింది. ఏం చేస్తాం? ప్చ్!" అంటూన్న పాండేవంక చురుగ్గా చూసింది రూపమతి.

కారుని డ్రైవ్ చేస్తూన్న పాండే ఆమెని గమనించలేదు.

"అంటే యాడ్ ఫిల్ముకి సెలెక్ట్ చేసుకున్న ప్రతి పిల్లనీ మీరిలాగే వేధిస్తారా?" కోపంగా అడిగింది రూపమతి.

"అది మా జియాజీరావు సార్ టేస్ట్‌ని బట్టి ఉంటుంది. ఆయన వద్దనుకున్నప్పుడే నా అదృష్టం పండుతుంది" అన్నాడతను ముసిముసిగా నవ్వుతూ.

"ఎవరా జియాజీరావ్?"

రూపమతి గొంతు తీవ్రంగా ధ్వనించేసరికి ఆమె వంక విసుగ్గా చూశాడు పాండే

రూపమతి మొహం కోపంతో ఎర్రబడిపోవటం చూసి కారుని రోడ్డు ప్రక్కకి మళ్ళించి ఆపేశాడు పాండే

ఆ వెంటనే ఆమెవంక తిరిగాడు పాండే

"చూడండి మిస్ రూపా! మీరలా కోపాన్ని తెచ్చుకుని ఉన్న కొద్ది మీ అందాన్ని పాడుచేసుకోవద్దు. మీరో గొప్ప అందగత్తె అనుకుని నేను మిమ్మల్ని సెలక్ట్ చేయలేదు. మీ ఫిజిక్ అంటే మీ బాడీ, బ్యూటీ, మీ వొంపు సొంపులు మాత్రమే మాకు కావాల్సి వచ్చాయి. అందుకే లాంగ్ షాట్ నుంచి మీతో ఫిల్ముని లాంగించాల్సివచ్చింది. మీరిపుడలా మొహాన్ని విరుచుకుంటూ అంత వికారంగా కనిపిస్తే నేను తీసిన మీ ఫిల్ముని జియాజీరావు నిమిషంలో తగలబెట్టేస్తాడు. దాంతో మీ ఫ్యూచర్ ఏమవుతుందో ఆలోచించండి!"

పాండే అన్న మాటలు రూపమతికి కొరడా దెబ్బల్లా తగిలాయి, ఆమె మొహం వెంటనే మరింతగా పాలిపోయింది.

"మీరు కోపరేట్ చేసి జియాజిరావు దృష్టిని మళ్ళించకపోతే నష్టం మీకే కాని నాకు కాదు అందుకే మీ ఫేట్ గురించి కాకుండా మీ 'ఫేస్' గురించి ఆలోచించండి" అంటూ కారుని స్టార్ట్ చేశాడతను.

కారు 'చండేరీ గెస్ట్‌హౌస్' ఆవరణలో ఆగిపోయింది.

ఊరికి దూరంగా ఓ కొండకి దిగువగా ఎత్తయిన ప్రదేశంలో ఉన్న ఆ బంగళా పరిసరాలు ప్రశాంతంగా ఉన్నాయి.

పోర్టికోలో ఓ కారు ఆగివుంది.

వసారలో ఒకరిద్దరు పనివాళ్ళలా ఉన్నారు, అక్కడ ఆగివున్న కారు డ్రైవరుతో ఏదో మాట్లాడుతున్నారు.

కారునాపాక దిగిపోయిన పాండే వెంట బంగళాలోకి వెళుతూ, రూపమతిని చూసి వసారాలోని పనివాళు చెవులు కొరుక్కోసాగారు.

రూపమతిని 'యాంటీ రూం'లో కూర్చోబెట్టి ప్రక్కనున్న గదిలోకి వెళ్ళాడు పాండే

ఆ గదిని బాగా తీర్చిదిద్దివుంచటాన్ని రూపమతి గమనించింది. 'చండేరీ' చీరలని ధరించిన 'మోడల్స్' బొమ్మలెన్నో ఆ గది గోడలపైన వేళ్ళాడుతున్నాయి.

హాల్లోనే ఓ పెద్ద అద్దాలున్న బీరువాలో కొన్ని చండేరీ చీరల్ని ప్రదర్శనకోసం ఉంచినట్లుంది.

తాము లోనికి రాగానే ముందు తలుపులు మూసుకోవటం గమనిస్తూనే ఉందామె.

ఒంటరిగా ఉండిపోయిన రూపమతి గుండెలు ఒక్కసారిగా భయంతో ఉప్పొంగిపోసాగాయి. పాలభాగం స్వేదమయం అవుతోంది, ఒళ్ళు ఒణికి పోసాగింది. తను లోనయిన పరిస్థితినుంచి కాపాడమని భగవంతుణ్ణి కోరుకుంటూ కళ్ళుమూసుకుందామె.

ఇంతలో ప్రక్క గదిలోనుంచి మాటలు వినిపించసాగాయి.

పాండే లోనికి వెళ్ళిన గది వెనుకవైపు మరో గది ఉంది. అదంత వరకూ మూసివుండటం వల్ల ఏమీ వినిపించలేదు. ఇప్పుడా తలుపు తెరుచుకున్నట్లుంది.

"షి ఈజ్ యావరేజ్ గర్ల్! బట్ హావింగ్ ఏ టెరిఫిక్ బాడీ బ్యూటీ!" అంటున్నాడు పాండే

"ఫిలిం ఎలా వచ్చింది?" జియాజీరావు గొంతు వినిపించింది.

"చాలా బాగా వచ్చింది సర్! మీరే చూస్తారుగా" హుషారుగా అంటున్నాడు పాండే

"ఓ.కె. ఆ పిల్లకి విషయం చెప్పావా?" అంటున్న జియాజీరావు ప్రశ్నకు పాండే సమాధానం ఇవ్వలేదు, బహుశా ఏదో సంజ్ఞని చేసి ఉంటాడు.

ఓ నిమిషం తర్వాత హాల్లోకి వచ్చాడు పాండే

అతనివంక భయంగా చూసింది రూపమతి.

"మిస్ రూపా! కోపరేట్ ఇన్ యువరోన్ ఇంటరెస్ట్" అంటూ గబగబా వెళ్ళిపోతున్న అతనివంక అలాగే చూస్తూ ఉండిపోయిందామె.

పాండే వెళ్ళిపోయాక రూపమతి తేరుకునేందుకు రెండు నిమిషాల సమయం పట్టింది.

దాంతో ధైర్యాన్ని కొని తెచ్చుకుంటూ ప్రక్కగదిలోకి నడిచింది. ఆ గది నానుకుని ఉన్న మరోగది తలుపు కొద్దిగా తెరిచి ఉంది.

జియాజీరావు ఉన్న ఆ గది చాలా విశాలంగా ఉంది. ఆ గదిలోని మంచం కూడా గది వైశాల్యంతో పోటీపడుతోంది.

అతని ముందున్న ఆ సరంజామాని చూస్తూనే ఉలిక్కిపడింది రూపమతి.

"కమాన్ మిస్!"

జియాజీరావు గొంతు మత్తుగా పలికింది.

అతనికి నలభై ఏళ్ళుంటాయి. కానీ ఆ వయస్సు కనిపించకుండా అందంగా, హుందాగా ఉన్నాడతను.

రూపమతి బాగా వెలుగులోకి రాగానే ఆమెని చూసి ఎందుకో తృళ్ళిపడుతూ దిగ్గున లేచి నుంచున్నాడు జియాజీరావు!

ఏడాది పసిపాప అడుగులో అడుగువేస్తూ తనవంక వస్తున్నట్లుగా రూపమతిని చూసి ఒక్కసారిగా అతని గుండెలుగ్గబట్టుకునిపోయాయి.

దాంతో గభాలున సోఫాలో కూర్చుండిపోయి గ్లాసులో ఉన్న ద్రవాన్ని ఒక్కసారిగా నోట్లో పోసుకున్నాడు.

దగ్గరగా వచ్చేసిన ఆమెని చూసేందుక్కూడా ధైర్యాన్ని కోల్పోయినవాడిలా సిగరెట్‌ని వెలిగించుకుంటూ మండుతున్న అగ్గిపుల్ల వెలుగు మీదుగా చూశాడు. అలా చూస్తూనే మరోసారి తృళ్ళిపడ్డాడతను.

అతని చేతిలో కాలుతూన్న మార్పుల్ని ఆశ్చర్యంగా గమనిస్తున్న రూపమతి కాస్త త్వరగా తేరుకుంది.

గబగబా పరిగెత్తి అగ్గిపుల్లని ఆర్పేసి వెలుగుతున్న సిగరెట్‌ని తీసి అతనికందించింది.

జియాజీరావుకు బాగా దగ్గరగా వెళ్ళాక రూపమతి కూడా ఓసారి చలించిపోయింది.

అతన్ని చూస్తుంటే ఆమె మనస్సు కూడా మూగపోసాగింది.

రూపమతినలాగే వదిలేసి గబగబా అక్కడినుంచి వెళ్ళిపోయాడు జియాజీరావు.

అతను వెళ్ళిపోయిన ఓ ఐదు నిమిషాల తర్వాత తను బంగళాలోకి వస్తుండగా కనిపించిన కారు డ్రైవర్ లోనకొచ్చాడు.

అంతవరకూ అచేతనంగా ఆలోచనారహితంగా నిలబడిపోయిన రూపమతి తనకి దగ్గరగా వచ్చి నిలబడివున్న కారు డ్రైవర్ని చూసి కొంచెం తేరుకుంది.

ఓ నోట్లకట్టని రూపమతికి అందించాడు డ్రైవర్.

"పాతికవేలు! సార్ ఇవ్వమన్నారు. మిమ్మల్ని తీసుకెళ్ళి సిటీలో దింపెయ్యమన్నారు" అంటూ వెనక్కి తిరిగిన డ్రైవర్ని ఆశ్చర్యంగా అనుసరించింది రూపమతి.

పోర్టికోలో తాము వచ్చిన కారుకానీ, పాండేకానీ ఆమెకి కనిపించలేదు.

జరిగినదేమిటో తెలుసుకునే అవకాశాన్ని కూడా ఇవ్వకుండా బండిని స్టార్ట్ చేశాడు డ్రైవర్.

కారులో కూర్చోబోతూ ఒసారి బంగళావంక చూసింది రూపమతి.

'యాంటీ రూం' తలుపు వెనుక నుంచుని తనవంకే చూస్తున్న జియాజీరావు కనిపించాడామెకి.

ఆ క్షణమే..

20 ఏళ్ళ క్రితం అంతమైందనుకున్న కథ తన ఉనికితో తిరిగి ఆరంభమైందని రూపమతికి తెలియదు.

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments